## అందరి కండ్లల్లో ఆనందం నింపుతాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 10 : ప్రజల కోసం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి అందరి కండ్లల్లో ఆనందం నింపుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఆరు గ్యారంటీల్లో భాగమైన ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన మాట ప్రకారం రెండు పథకాలను ప్రారంభించామని, మిగతా వాటిని వందరోజుల్లో అమలు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా మేడిపల్లి ప్రాంతంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్లు స్రవంతి, ఆర్తిక, స్వప్న, జడ్పీటీసీ మహిపాల్, కౌన్సిలర్లు భానుగౌడ్, రమేశ్, మమత, మంగ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీశైలం యాదవ్

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 10: మహిళలు స్వయం ఉపాధిని పెంపొందించుకొని ఆర్థికంగా ఎదగాలని ఫరూఖ్‌నగర్ మండలంలోని కిషన్‌నగర్ సర్పంచ్ శ్రీశైలంయాదవ్ అన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనం లో ఆదివారం మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం

ఆమనగల్లు, డిసెంబర్ 10 : పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న బ్రహ్మకుమారీస్ రాజయోగ కేంద్రంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై బలరాం ముఖ్య అతిథిగా హాజరై శివుడికి పూలదండ వేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ రాజయోగ కేంద్రం నిర్వాహకురాలు విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్సై యాదయ్య, కానిస్టేబుల్ శివ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన క్షణికావేశం

- భార్యపై భర్తతో కత్తితో దాడి
- దవాఖానకు తరలించేలోపు మృతి

ఆదిబట్ల, డిసెంబర్ 10 : భార్యాభర్తల మధ్య మాటామాట పెరిగింది. దీంతో గొడవ పెరగడంతో.. క్షణికావేశంలో భార్యపై భర్త కత్తితో దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా నేరెడుకొమ్ము మండలం మోసగడ్డతండాకు చెందిన బానోత్ జబ్బర్‌లాల్ తన భార్య బానోత్ జ్యోతి (33)తో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయాంజాల్‌లో ఉన్న సూరజ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి జబ్బర్‌లాల్ తన భార్య జ్యోతితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్యన మాటలు పెరగడంతో భార్యను కూరగాయలు కోసే కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. వెంటనే కుటుంబ సభ్యులు వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించడంతో డాక్టర్లు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు ప్రారంభం



షాబాద్ : చేవెళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, డిసెంబర్ 10: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10లక్షల బీమా కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి గతంలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, ఎంపీపీ విజయలక్ష్మి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్, తహసీల్దార్ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు వెంకటరంగారెడ్డి, పాపారావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, నరహరిరెడ్డి, ఎంపీటీసీ రాములు, మైనారిటీ అధ్యక్షుడు అలీ, నాయకులు శంకర్, రాజేందర్‌గౌడ్, నాగార్జునరెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గిరిధర్ రెడ్డి, మల్లారెడ్డి, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు అందుబాటులో ఉంటా..

చేవెళ్లటౌన్ : చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్యను ఎంపీపీతో పాటు పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, సర్పంచ్‌లు మాణిక్యారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరహరి రెడ్డి, శేరి దర్శన్, శంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్, కృష్ణ, సీనియర్ నాయకులు అలీ, రాజు, శేరి రాజు, రవి తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత

మొయినాబాద్ : మండల పరిధిలోని మొయినాబాద్‌కు చెందిన జయాకర్ రోడ్డు ప్రమాదంలో గత కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన పేరుపై బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించింది. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో వచ్చిన రూ.2లక్షల ఆర్థికసాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ అనంతరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు పరమేశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముజ్జు, సీనియర్ నాయులు షేక్ మహబూబ్, మోహిన్, సూరియాదవ్, షాబాద్ ప్రవీణ్‌కుమార్, కృష్ణ,ప్రమోద్, రవి పాల్గొన్నారు.

## మాలదీక్షాపరులకు కొనసాగుతున్న అన్నదానం



అన్నదానం చేస్తున్న శేరి వెంకటరెడ్డి

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 10 : మున్సిపాలిటీలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో అయ్యప్ప మాలదీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రతి రోజూ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో 41రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణానికి చెందిన శేరి వెంకట్‌రెడ్డి సహకారంతో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అంతకు ముందు అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు నందీశ్వర్, రాఘవేందర్, ప్రతాప్‌రెడ్డి, బద్రి, లక్ష్మీనారాయణ, రాజు, జైహింద్, కోటిలింగం, శ్యామ్, అశోక్, మహేశ్, చంద్రశేఖర్, నర్సింహులు, శరత్‌బాబు, రమేష్, సురేష్, సంపత్, ప్రకాష్, చిన్నయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 10: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం తర్వాత వేద మంత్రోచ్చారణల మధ్య చండీ హోమం జరిపించారు. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు ఉదయం నుంచే పూజలు నిర్వహించేందుకు ఆలయాలకు వెళ్లారు. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నదని ఆలయ చైర్మన్ మహేందర్ తెలిపారు. తెల్లవారుజాము నుంచే కార్తిక దీపాలు వెలిగించేందుకు మహిళలు వస్తారని చెప్పారు.

## ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, డిసెంబర్ 10 : మండలంలోని అంతారం గ్రామంలో గజ్జల జంగయ్య శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయమై మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఉప్పల చారిటబుల్ ట్రస్టు తరపున రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో కష్టాల్లో ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని పేర్కొన్నారు. అలాగే పడమటి తండా గ్రామ పంచాయతీలోని సంఘాయితండాకి చెందిన మూడవత్ జంగ్లీ గుండెపోటుతో మరణించింది. బాధిత కుటుంబాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, రాములు, శివ, ఆంజనేయులు, వెంకటయ్య, శ్రీను, రమేశ్, చంద్రయ్య, శంకర్, శ్రీను, గోపి, లక్ష్మణ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

ఆమనగల్లు, డిసెంబర్ 10 : ఆరుగాలం శ్రమించి సేద్యం చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ పేర్కొన్నారు. ఆమనగల్లు జాతీయ రహదారిపై పలు చోట్ల వడ్లు ఆరబోసిన రైతు లను ఆదివారం డీటీ కలిసి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కనీస మద్దతు ధరపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని గ్రేడ్ ఏ, గ్రేడ్ బీ రకాలుగా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదని ఈ విషయంలో రైతులు అపోహలు వీడాలని అనవసరంగా దళారులను నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు.



విఠాయిపల్లిలో వడ్లను పరిశీలిస్తున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్

## ప్రమాదవశాత్తు గీత కార్మికుడి మృతి

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 10: తాటిచెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కవాడిపల్లిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కవాడిపల్లికి చెందిన సుర్వి కాశయ్యగౌడ్ (46) ఎప్పటిలాగే కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్సై కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించారు. కాశయ్యగౌడ్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మన్మోహన్ తెలిపారు.

## ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించండి



రోడ్డు పక్కన ప్రమాదకరంగా చెట్టు

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్10: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని కేశంపేట్‌రోడ్డులో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్టు పూర్తిగా రోడ్డుపై ఒరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. చెట్టు వేర్లు కూడా బయటకు వచ్చాయని, పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పుడు చెట్టు కొమ్మలు వాహనాలకు తగులుతున్నాయని వాపోతున్నా రు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.